ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజా ప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :303 గురువారం ఆగష్టు 27 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

# మెదక్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో

# ఏజెంట్లు ఎంత చెప్తే అంతే ఫిక్స్




**●రాష్ట్రంలో ఎన్నో ఏసీబీ దాడులు జరిగిన మారని జిల్లా రవాణాదికారి కార్యాలయం సెక్రటరీ ఆర్టీవో మెదక్ జిల్లా**

**●ప్రజాస్వామ్యంలో ఎంతో పటిష్టమైన రవాణా శాఖని వారి పరసంటెజిల కోసం అంగట్లో అమ్ముతున్న మెదక్ జిల్లా రవాణా శాఖ అధికారులు...?**

**●ఆ రవాణా శాఖ కార్యాలయంలో ఎజెంట్లదే హావ...? ఎజెంట్లు అంటే అక్కడ అధికారులకి మహా ప్రీతి...?**

**●ఎజెంట్లు ఎంత చెపితే అంత నడవాల్సిందే నేరుగా ఆన్లైన్ చేసుకొని వెళ్తే పనులు కాకపోగా కొయ్యో మొర్రో అంటూ ఎజెంట్ల దగ్గరికి పరిగెత్తించే అంతటి నీతి మంతులు ఆ కార్యాలయంలో అధికారులు ...?**

(తెలంగాణ స్టేట్ బ్యూరో ప్రత్యేక కథనం మెదక్ జిల్లా రవాణా శాఖ కార్యాలయం):మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నిఘాలో భాగంగాఏసీబీ దాడులు అన్ని చోట్ల జరుగుతున్నాయి మెదక్ జిల్లా జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో కూడ ఏసీబీ అధికారులు దృష్టి సారించాలి అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు...?రాష్ట్రంలో ఎన్నో ఏసీబీ దాడులు అయినా మారని మెదక్ జిల్లా రవాణా శాఖ అధికారులు. ప్రజాస్వామ్యంలో ఎంతో పటిష్టమైన రవాణా శాఖని వారి పరసంటెజిల కోసం అంగట్లో అమ్ముతున్న రవాణా శాఖ అధికారులు. మెదక్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఎజెంట్ల దే హావ.ఎజెంట్లు అంటే అక్కడ అధికారులకి మహా ప్రీతి.ఎజెంట్లు ఎంత చెపితే అంత నడవాల్సిందే నేరుగా ఆన్లైన్ చేసుకొని వెళ్తే పనులు కాకపోగా కొయ్యో మొర్రో అంటూ ఎజెంట్ల దగ్గరికి పరిగెత్తించే అంతటి నీతి మంతులు ఆ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. కాగితాలన్నీ సక్రమంగా ఉన్న పని జరగదు గాక జరగదు. అవినీతి ఇక్కడ మూడు పువ్వులు, ఆరు కాయలుగా విలసిల్లుతూ సామాన్యుడిని నరనరాన డబ్బులు గుంజుతూ అవినీతికి కేరాఫ్‌గా మారింది మెదక్ జిల్లాలో ఉన్న రవాణా శాఖ కార్యాలయం ఈ కార్యాలయంలో ప్రతి పనికి ఒక రేటు ఉంటుంది. ఒక్కో పనికి ఒక అధికారిని కలవాల్సి ఉంటుంది, ఎవరైనా అన్ని సరైన ధ్రువపత్రాలతో నేరుగా కార్యాలయానికి వెళ్తే వాళ్లకు కోర్రిలే తప్పువు. సాక్షాత్తు కౌంటర్‌లోని అధికారే మీ బ్రోకర్ ఎవరు అతని పేరు కోడ్ రూపంలో దరఖాస్తు వెనుకభాగం వైపు రాయమని అడుగుతాడు. ఒకవేళ దరఖాస్తుదారుడు నేరుగా వచ్చామని చెప్తే దరఖాస్తు ఏదో ఒక కారణంతో పక్కకు పోతుంది. కింది స్థాయి ఉద్యోగులను గాడిలో పెట్టాల్సిన అధికారులే అవినీతికి పాల్పడితే సిబ్బంది సరైన మార్గంలో ఎలా నడుస్తారు..?



## ▶రవాణా శాఖలో అసలు ఎందుకు ఇంత విచ్చలవిడి.. తనం ?

వివరణ సైతం ఇవ్వడానికి కనిపించని డిటిఓ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ఎప్పుడు ఆఫీసులో ఉండరు ఏదో ఒక పని మీద బయటకు వెళ్తారు మేము ఎం చేయాలి ప్రజలే ఎజెంట్లని ఫాలో అవుతున్నారు మేము చేయాలి అంటూ సమాధానం మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఇన్వెస్టిగేషన్లో భాగంగా తెలింది ఏమిటి అంటే మెదక్ జిల్లా రవాణా శాఖలో ప్రతి పనికి ఒక రేటు ఆ రేటులో అధికారులకి వాటాలు వీరికింత వారికింత అన్నచందంగా నడుస్తుంది అని జిల్లాలో గుసగుసలు అంతే కాదు ఇందులో రాష్ట్ర స్థాయి అధికారులకి సైతం వాటాలు వెళ్తాయి
అని విశ్వసనీయ



సమాచారం ఇప్పటికైనా జిల్లాలో విజిలెన్స్ అధికారులు ఏసీబీ అధికారులు రవాణాశాఖ కార్యాలయం పై నిఘాను వహిస్తే అన్ని నిజ నిజాలు బయటకు వస్తాయి అని పలువురు జిల్లా ప్రజలు కోరుతున్నారు.వేచి చూడండి అతి త్వరలో మీ ముందుకు మరో సంచలనాత్మక కథనంతో మీ మా మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రికలో








మన
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
# ప్రజా ప్రతినిధి
తెలుగు దినపత్రిక
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :303 గురువారం ఆగష్టు 27 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH


## మానవతకు అంకితమైన మహోన్నత జీవితం

- పేదల సేవలో గడిచిన ప్రతి క్షణం
- ప్రేమ, కరుణలకు ప్రతిరూపంగా నిలిచిన వ్యక్తిత్వం
- ప్రపంచానికి సేవా స్ఫూర్తిని అందించిన మహనీయురాలు మదర్ థెరిసా



కోల్‌కతా, ఆగస్టు 26 (మనప్రజాప్రతినిధి): ప్రపంచ చరిత్రలో మానవ సేవకు తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేసిన మహనీయుల్లో మదర్ థెరిసా పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. 1910 ఆగస్టు 26న జన్మించిన ఆమె తన వ్యక్తిగత జీవితాన్ని పక్కన పెట్టి పేదలు, అనాథలు, నిరాశ్రయులు, రోగుల సేవకే అంకితమయ్యారు. ప్రేమ, దయ, కరుణ, త్యాగం అనే విలువలను ఆచరణలో చూపిస్తూ లక్షలాది మందికి ఆదర్శంగా నిలిచారు. అందుకే ప్రతి సంవత్సరం ఆమె జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆమె సేవలను స్మరించుకుంటారు. మదర్ థెరిసా అసలు పేరు అగ్నెస్ గోంజా బొయాజ్యూ. చిన్నప్పటి నుంచే ఆమెకు మతపరమైన సేవా కార్యక్రమాలపై ఆసక్తి ఉండేది. యువత దశలోనే సన్యాస జీవితం ఎంచుకున్న ఆమె భారతదేశానికి వచ్చి కోల్‌కతాలో స్థిరపడ్డారు. అక్కడ పేదరికం, ఆకలి, వ్యాధులతో బాధపడుతున్న ప్రజల పరిస్థితిని చూసి వారి సేవ కోసం జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయమే ఆమెను

2

## భూముల విధానంపై హరీశ్ రావు విమర్శలు



- 22ఏ బాధితులకు అండగా ఉంటామని భరోసా
- ప్రభుత్వ భూముల విక్రయాలపై ఆందోళన
- కూకట్‌పల్లిలో బాధితులతో సమావేశం
- ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచన

2

## అమెరికాలో రోడ్డు ప్రమాదంలో... తెలంగాణ యువకుడు మృతి



- మూడు నెలల క్రితమే అమెరికా పయనం
- ఫ్లోరిడాలో ఘోర ప్రమాదం
- కుటుంబంలో విషాద ఛాయలు
- ప్రమాదంపై పోలీసుల దర్యాప్తు

2

## డీఎంకేలో సంస్థాగత సంస్కరణల జోరు



- పదవులకు వయోపరిమితి నిర్ణయం
- రెండు పర్యాయాలకే బాధ్యతలు
- యువ నాయకత్వానికి ప్రాధాన్యం

చెన్నై, ఆగస్టు 26 (మనప్రజాప్రతినిధి): తమిళనాడులో ప్రధాన రాజకీయ పార్టీలలో ఒకటైన డీఎంకే సంస్థాగత వ్యవస్థలో విస్తృత మార్పులకు శ్రీకారం చుట్టింది. పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ నేతృత్వంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో కీలక సంస్కరణలకు ఆమోదం లభించింది. పార్టీ నిర్మాణంలో యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించడం, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించడం, సంస్థాగత వ్యవస్థను మరింత చురుకుగా మార్చడం లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కార్యవర్గ సమావేశంలో ఆమోదించిన కొత్త నిబంధనల ప్రకారం పార్టీ పదవులకు వయోపరిమితి విధించారు. బ్రాంచ్ పార్టీ కార్యదర్శి పదవికి గరిష్ఠ వయస్సును 45 ఏళ్లుగా నిర్ణయించారు. మున్సిపల్, సిటీ, టౌన్ పంచాయతీ వార్డు కమిటీ కార్యదర్శుల వయస్సు 50 ఏళ్లకు మించరాదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయాల ద్వారా పార్టీ దిగువ స్థాయిలో యువ నాయకులకు అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు.టౌన్ పంచాయతీ పార్టీ కార్యదర్శులు, ఏరియా కమిటీ కార్యదర్శులు, సిటీ కమిటీ కార్యదర్శుల పదవులకు గరిష్ఠ వయోపరిమితిని 60 ఏళ్లుగా నిర్ణయించారు. జిల్లా పార్టీ కార్యదర్శుల వంటి కీలక బాధ్యతలకు మాత్రం 70 ఏళ్ల వరకు అవకాశం కల్పించారు. అనుభవం, యువశక్తి రెండింటికీ సమతుల్యత ఉండేలా ఈ వ్యవస్థను రూపొందించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పదవీకాలాలకు సంబంధించి కూడా డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఈ పదవుల్లో ఎన్నికయ్యే నాయకులు వరుసగా రెండు పర్యాయాలకు మించి కొనసాగేందుకు అవకాశం ఉండదు. దీర్ఘకాలంగా ఒకే వ్యక్తులు పదవుల్లో కొనసాగకుండా, కొత్తవారికి అవకాశాలు కల్పించడమే ఈ నిబంధన ఉద్దేశమని పార్టీ నాయకులు చెబుతున్నారు. దీంతో సంస్థాగత స్థాయిలో నాయకత్వ మార్పిడికి మార్గం సుగమం కానుంది.స్థానిక సంస్థాగత నిర్మాణంలోనూ పలు మార్పులు చేపట్టారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో ఒక్కో ఏరియా కమిటీ పరిధిలో సగటున 40 వేల మంది ఓటర్లు ఉండేలా నిర్ణయించారు. ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ సంఖ్యను 30 వేలుగా నిర్దేశించారు. సిటీ కమిటీల పరిధిలో కూడా సగటున 40 వేల మంది ఓటర్లు ఉండేలా కొత్త మార్గదర్శకాలను రూపొందించారు. ఈ మార్పులు పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడతాయని భావిస్తున్నారు. డీఎంకే

2

## ప్రగతి సమావేశంలో కీలక ప్రాజెక్టుల సమీక్ష



- 53వ ప్రగతి సమావేశానికి ప్రధాని మోదీ అధ్యక్షత
- రూ.30 వేల కోట్లకు పైగా ప్రాజెక్టుల పరిశీలన
- మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- వ్యవసాయం, సైబర్ భద్రతపై కీలక సూచనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 26 (మనప్రజాప్రతినిధి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 53వ ప్రగతి సమావేశానికి అధ్యక్షత వహించి దేశంలోని కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. రైల్వే, రహదారులు, విద్యుత్ రంగాలకు సంబంధించిన ఆరు ప్రధాన ప్రాజెక్టుల అమలుపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ ప్రాజెక్టులు తొమ్మిది రాష్ట్రాల్లో విస్తరించి ఉండగా, వాటి మొత్తం పెట్టుబడి విలువ రూ.30 వేల కోట్లకు మించి ఉందని అధికారులు వెల్లడించారు. మౌలిక వసతుల ప్రాజెక్టులను విడివిడిగా కాకుండా సమగ్ర దృష్టితో చూడాలని ప్రధాని సూచించారు. ఒక ప్రాజెక్టులోని ప్రతి భాగం పరస్పరం అనుసంధానమై ఉంటుందని, అందువల్ల మొత్తం ప్రాజెక్టు లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని అమలు జరగాలని పేర్కొన్నారు. పనుల వేగం, నాణ్యత, సమన్వయంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని అన్నారు.ప్రాజెక్టుల అమలులో ప్రతి దశలో సంస్కరణలు కొనసాగాలని, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు చురుకైన పని విధానాన్ని అవలంబించాలని ప్రధాని సూచించారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే గుర్తించి పరిష్కరించే విధానాన్ని అనుసరించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన అగ్రిస్టాక్ కార్యక్రమాన్ని సమీక్షించిన సందర్భంగా వ్యవసాయ సమాచారాన్ని మరింత సమర్థంగా వినియోగించేందుకు కృత్రిమ మేధస్సు సహా అత్యాధునిక డిజిటల్ సాంకేతికతలను ఉపయోగించాలని ప్రధాని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు, సమాచార ఆధారిత నిర్ణయాలు అందించేందుకు సాంకేతికత కీలకమని పేర్కొన్నారు.సైబర్ మోసాలు, 'డిజిటల్ అరెస్టు' పేరుతో జరుగుతున్న మోసాల అంశంపై కూడా ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో అవగాహన పెంపు, సైబర్ భద్రతపై విద్య, అధికారులకు శిక్షణ, సంబంధిత సంస్థల మధ్య సమన్వయం ద్వారా ఇటువంటి మోసాలను అరికట్టాలని సూచించారు. డిజిటల్ ప్రపంచంలో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. దేశ అభివృద్ధిలో మౌలిక వసతుల రంగం కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రవాణా, విద్యుత్, డిజిటల్ రంగాల అభివృద్ధి ద్వారా ఆర్థిక వృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. ప్రగతి సమావేశం ద్వారా ప్రాజెక్టుల అమలులో ఉన్న అడ్డంకులను తొలగించి వేగవంతమైన అభివృద్ధి సాధించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## పిఠాపురం ఆధ్యాత్మిక వైభవానికి రూ.30.66 కోట్లు



- దేవాలయాలు, భజన మందిరాల అభివృద్ధికి భారీ నిధులు
- ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో పనులకు వేగం
- భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు
- ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణకు ప్రాధాన్యం

2

# మానవతకు అంకితమైన మహోన్నత జీవితం




ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన సేవామూర్తిగా నిలబెట్టింది. 1950లో ఆమె స్థాపించిన మిషనరీస్ ఆఫ్ చారిటీ సంస్థ ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలకు కేంద్రబిందువుగా మారింది. అనాథ పిల్లలు, నిరాశ్రయులు, కుష్టు వ్యాధిగ్రస్తులు, మరణశయ్యపై ఉన్నవారికి ఆశ్రయం కల్పించడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యంగా నిలిచింది. చిన్న స్థాయిలో ప్రారంభమైన ఈ సంస్థ క్రమంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించి వందలాది సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. మానవ సేవే మాధవ సేవ అనే భావనతో సంస్థ పని చేసింది. మదర్ థెరిసా సేవల ప్రత్యేకత ఆమె చూపిన అపారమైన ప్రేమ. సమాజం నిర్లక్ష్యం చేసిన వారిని కూడా ఆమె గౌరవంతో ఆదరించేవారు. పేదరికం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదని, ప్రేమ లేమి కూడా ఒక పెద్ద పేదరికమని ఆమె చెప్పిన మాటలు నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయి. బాధలో ఉన్నవారికి ఓదార్పు ఇవ్వడం, వారికి అండగా నిలవడం ఆమె సేవా తత్వానికి మూల సూత్రం. భారతదేశంలోని కోల్‌కతా వీధుల్లో ప్రారంభమైన ఆమె సేవలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయి. ఆసియా, ఆఫ్రికా, యూరప్, అమెరికా ఖండాల్లో మిషనరీస్ ఆఫ్ చారిటీ సేవా కేంద్రాలు ఏర్పడ్డాయి. వేలాది మంది స్వచ్ఛంద సేవకులు ఆమె స్ఫూర్తితో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మానవత్వానికి సరిహద్దులు ఉండవని ఆమె జీవితం నిరూపించింది. ఆమె సేవలకు గుర్తింపుగా అనేక అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి. 1979లో ప్రపంచ శాంతి, మానవ సేవలకు చేసిన కృషికి గాను నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. అలాగే భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను కూడా పొందారు. ఈ పురస్కారాలు వ్యక్తిగత గౌరవం కోసం కాదని, పేదల పట్ల ప్రపంచ దృష్టిని ఆకర్షించేందుకు వచ్చిన గుర్తింపులుగా ఆమె భావించేవారు. మదర్ థెరిసా జీవితం త్యాగానికి ప్రతీకగా నిలిచింది. సాదాసీదా వస్త్రధారణ, నిరాడంబర జీవనం, సేవ పట్ల అంకితభావం ఆమె వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి. సంపద, అధికారాలు, ఖ్యాతి కంటే మానవ సేవే గొప్పదని ఆమె తన జీవితంతో నిరూపించారు. అందుకే వివిధ మతాలు, దేశాలు, సంస్కృతులకు చెందిన ప్రజలు ఆమెను గౌరవంతో స్మరిస్తున్నారు. నేటి సమాజంలో పెరుగుతున్న స్వార్థం, వ్యక్తిగత ప్రయోజనాల మధ్య మదర్ థెరిసా చూపిన మార్గం మరింత ప్రాసంగికంగా కనిపిస్తోంది. అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, బలహీన వర్గాల పట్ల సానుభూతి చూపించడం, మానవత్వాన్ని కాపాడడం వంటి విలువలు సమాజ అభివృద్ధికి ఎంతో అవసరం. ఆమె బోధనలు నేటి తరాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. 2016లో కాథలిక్ చర్చి ఆమెను సెయింట్ థెరిసా ఆఫ్ కలకత్తాగా ప్రకటించింది. ఇది ఆమె సేవలకు లభించిన అత్యున్నత ఆధ్యాత్మిక గౌరవంగా భావించబడుతోంది. అయితే ప్రజల హృదయాల్లో ఆమెకు లభించిన స్థానం ఏ బిరుదుకన్నా గొప్పది. కోట్లాది మంది ఆమెను ప్రేమ, కరుణ, సేవలకు ప్రతీకగా భావిస్తారు. మదర్ థెరిసా జయంతి సందర్భంగా ఆమె సేవా భావాన్ని స్మరించుకోవడం మాత్రమే కాకుండా, మన జీవితాల్లో కూడా ఆ విలువలను ఆచరించేందుకు ప్రయత్నించాలి. అవసరంలో ఉన్నవారికి తోడ్పాటు అందించడం, మానవత్వాన్ని కాపాడడం, ప్రేమను పంచడం ద్వారా ఆమెకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతాం. మదర్ థెరిసా జీవితం తరతరాలకు స్ఫూర్తినిస్తూ మానవ సేవకు మార్గదర్శకంగా నిలుస్తూనే ఉంటుంది.

# భూముల విధానంపై హరీశ్ రావు విమర్శలు




హైదరాబాద్, ఆగస్టు 26 (మనప్రజాప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ విధానాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కూకట్‌పల్లిలో 22ఏ నిషేధిత జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులతో సమావేశమైన ఆయన, వారి సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీశ్ రావు, ప్రభుత్వ ప్రధాన బాధ్యత ప్రజలకు విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, ఉపాధి వంటి మౌలిక సేవలను అందించడమేనని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కంటే భూముల వ్యవహారాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. భూముల చుట్టూ తిరిగే పరిపాలన ప్రజలకు ఉపయోగపడదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతానికి ప్రాధాన్యం ఇచ్చామని హరీశ్ రావు పేర్కొన్నారు. మిషన్ భగీరథ, నిరంతర విద్యుత్ సరఫరా, సాగునీటి ప్రాజెక్టులు, బస్తీ దవాఖానాలు, ఆసరా పింఛన్లు వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. ప్రభుత్వ భూములు భవిష్యత్ తరాలకు చెందిన ఆస్తులని, వాటిని విచక్షణారహితంగా విక్రయించడం సరైంది కాదని ఆయన అన్నారు. హైదర్‌నగర్‌లో పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని కూడా అమ్మకానికి పెట్టారని ఆరోపిస్తూ, భవిష్యత్ అవసరాలకు ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 22ఏ జాబితాలో భూములు చేర్చడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి కొనుగోలు చేసిన భూములపై ఆంక్షలు విధించడం వల్ల ప్రజలు ఆర్థిక, న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. బాధితుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూకట్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో 22ఏ బాధితులు తమ సమస్యలను హరీశ్ రావు దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను సంబంధిత వేదికల్లో ప్రస్తావించి పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేత హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# అమెరికాలో రోడ్డు ప్రమాదంలో... తెలంగాణ యువకుడు మృతి




నిజామాబాద్, ఆగస్టు 26 (మనప్రజాప్రతినిధి): అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఫ్లోరిడా రాష్ట్రంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలానికి చెందిన రాహుల్ మృతి చెందినట్లు సమాచారం. ఉన్నత విద్య, మెరుగైన భవిష్యత్తు లక్ష్యంగా కేవలం మూడు నెలల క్రితమే అమెరికా వెళ్లిన రాహుల్ ఆకస్మికంగా ప్రాణాలు కోల్పోవడం స్వగ్రామంలో విషాదాన్ని నింపింది. రాహుల్ అమెరికాలో ఉద్యోగ, విద్యా అవకాశాల కోసం వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడ స్థిరపడేందుకు ప్రయత్నాలు చేస్తున్న సమయంలోనే ఈ ప్రమాదం జరగడంతో అతని ఆశయాలు మధ్యలోనే ముగిశాయి. ప్రమాద వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇంటి వద్ద విషాద వాతావరణం నెలకొంది. ప్రమాదం జరిగిన సమయంలో రాహుల్ మరో ఇద్దరు యువకులతో కలిసి ప్రయాణిస్తున్నట్లు సమాచారం. అయితే ప్రమాదానికి దారితీసిన ఖచ్చితమైన కారణాలు ఇంకా వెల్లడికాలేదు. వాహనం అదుపు తప్పిందా, ఇతర వాహనంతో ఢీకొన్నదా అనే అంశాలపై అమెరికా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనలో మరణించిన మిగిలిన ఇద్దరు యువకుల పూర్తి వివరాలు కూడా వెలువడాల్సి ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే గాయాలు తీవ్రంగా ఉండటంతో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. రాహుల్ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు కుటుంబ సభ్యులు, సన్నిహితులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందుకు అవసరమైన పత్రాలు, అధికారిక ప్రక్రియల కోసం భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. మృతదేహం స్వదేశానికి చేరిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించనున్నారు. విదేశాల్లో మెరుగైన భవిష్యత్తు కోసం వెళ్లిన యువకుడు కొద్దికాలానికే దుర్మరణం పాలవడం నవీపేట్ ప్రాంత ప్రజలను కలచివేసింది. రాహుల్ కుటుంబానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అవసరమైన సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు. కుటుంబ సభ్యుల రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టిస్తున్నాయి.

# పిఠాపురం ఆధ్యాత్మిక వైభవానికి రూ.30.66 కోట్లు






పిఠాపురం, ఆగస్టు 26 (మనప్రజాప్రతినిధి): పిఠాపురం నియోజకవర్గంలోని ఆధ్యాత్మిక, చారిత్రక క్షేత్రాల అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో రూ.30.66 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆలయాల పునరుద్ధరణ, భజన మందిరాల నిర్మాణం, కల్యాణ మండపాల అభివృద్ధి ద్వారా నియోజకవర్గ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలోని 24 ప్రముఖ దేవాలయాల అభివృద్ధి, పునరుద్ధరణ కోసం రూ.17.06 కోట్లను కేటాయించారు. గొల్లప్రోలు సీతారామస్వామి ఆలయంలో ప్రాకార మండపం నిర్మాణం తుది దశకు చేరుకోగా, కొత్తపల్లిలోని జగన్నాథ, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపన పనులు పూర్తయ్యాయి. పిఠాపురం వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుల నివాస గృహాల నిర్మాణం కొనసాగుతుండగా, కుంతీమాధవస్వామి ఆలయం, రామకృష్ణాపూర్ సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కుక్కుటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు, శ్రీపాద శ్రీవల్లభ దేవస్థానానికి రూ.2 కోట్లు కేటాయించి ప్రత్యేక పనులు చేపట్టనున్నారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాల పరిరక్షణతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటైన శ్రీ కుంతీమాధవస్వామి ఆలయం సహా పలు పురాతన దేవాలయాలు ఈ ప్రాజెక్టు ద్వారా కొత్త రూపును సంతరించుకోనున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల ఆధునీకరణ పనులు చేపడుతున్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని పుణ్యక్షేత్రాలకు ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు తరలివస్తుండటంతో, వారికి మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పండుగలు, బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాల సమయంలో భారీగా వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు విస్తరిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో యు.కొత్తపల్లి మండలంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించారు. వివాహాలు, ధార్మిక కార్యక్రమాలు, సామాజిక అవసరాలకు అనువుగా అత్యాధునిక వసతులతో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించనున్నారు. గతంలో పిఠాపురం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపాన్ని కూడా ఆధునిక సదుపాయాలతో పునర్నిర్మించిన విషయం తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేసేందుకు తొలి దశలో 48 భజన మందిరాల నిర్మాణానికి రూ.11.60 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ భజన మందిరాలు భక్తి కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక సమావేశాలు, సాంస్కృతిక వేడుకలకు వేదికలుగా ఉపయోగపడనున్నాయి. మొత్తం రూ.30.66 కోట్లతో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు పిఠాపురం ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు తెలిపారు.

# మంగళగిరిలో రూ.18 కోట్ల రైతు బజార్

- గురువారం శంకుస్థాపన చేయనున్న నారా లోకేష్
- ఔరోబిందో ఫార్మా ట్రస్ట్ సిఎస్ఆర్ నిధులతో నిర్మాణం
- రైతులు, వినియోగదారులకు ఆధునిక సౌకర్యాలు
- పర్యావరణ హిత సమీకృత మార్కెట్ ఏర్పాటు



3

# డీఎంకేలో సంస్థాగత సంస్కరణల జోరు




చేపట్టిన ఈ సంస్కరణలను పార్టీ నాయకులు స్వాగతిస్తున్నారు. ఎంపీ పి. విల్సన్ మాట్లాడుతూ ఇవి సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేసే నిర్మాణాత్మక మార్పులని పేర్కొన్నారు. యువతకు అవకాశాలు కల్పించడంతో పాటు పార్టీని భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేసే చర్యలుగా వీటిని అభివర్ణించారు. రానున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా ఈ సంస్కరణలు డీఎంకేలో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# మంగళగిరిలో రూ.18 కోట్ల రైతు బజార్




మంగళగిరి, ఆగస్టు 26 (మనప్రజాప్రతినిధి): మంగళగిరిలో రూ.18 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో సమీకృత మోడల్ రైతు బజార్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. 5.90 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ గురువారం శంకుస్థాపన చేయనున్నారు. ఔరోబిందో ఫార్మా ట్రస్ట్ సిఎస్ఆర్ నిధులతో ఈ నిర్మాణం చేపట్టనున్నారు. జసుమారు 72 వేల చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణంతో రైతులకు, వినియోగదారులకు అనుకూలంగా ఈ మార్కెట్‌ను రూపకల్పన చేస్తున్నారు. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించేందుకు, వినియోగదారులు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా పొందేందుకు అన్ని వసతులు కల్పించనున్నారు. చిల్లర మార్కెట్ విభాగంలో 102 కూరగాయల స్టాళ్లు, 54 పండ్లు, పూల విక్రయ స్టాళ్లు, ఇతర ఉత్పత్తుల కోసం 60 దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే టోకు మార్కెట్ విభాగంలో 18 అన్‌లోడింగ్ ప్లాట్‌ఫారాలు, 23 కూరగాయల దుకాణాలను నిర్మించనున్నారు. రైతులు తమ ఉత్పత్తులను సులభంగా మార్కెట్‌కు తీసుకురావడానికి అనువుగా ఏర్పాట్లు చేయనున్నారు. ఈ సమీకృత మార్కెట్‌లో శీతల గిడ్డంగి, కూరగాయల శుభ్రపరిచే కేంద్రం, ప్రత్యేక పార్కింగ్ సదుపాయం, భోజనశాల, ప్రజా మరుగుదొడ్లు, నీటి నిల్వ వ్యవస్థ, జనరేటర్ వంటి ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండనున్నాయి. వ్యర్థాల నిర్వహణ కోసం సేంద్రియ వ్యర్థాల మార్పిడి యంత్రాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ భవనం పైభాగంలో సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో విద్యుత్ వినియోగం తగ్గడంతో పాటు పర్యావరణ హిత విధానాలకు ప్రోత్సాహం లభించనుంది. ఆధునిక మార్కెట్ మౌలిక వసతులతో రైతులు మెరుగైన ధరలు పొందే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత మంగళగిరి, పరిసర ప్రాంతాల రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయం లభించడంతో పాటు వినియోగదారులకు తాజా వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. ఈ రైతు బజార్ ప్రాంతీయ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు... ప్రధాన విధుల్లో ముస్లిం సోదరుల ర్యాలీ....



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఆగస్టు 26: చేగుంట పట్టణంలో పవిత్ర మిలాద్ ఉన్ నబీ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ ర్యాలీతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ర్యాలీలో చిన్నారులు, యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, సోదరభావం, ప్రేమ, మానవత్వం, పరస్పర గౌరవం వంటి విలువలను ప్రజలకు చాటుతూ ర్యాలీ కొనసాగింది. .పట్టణంలోని ప్రధాన కూడళ్లు, వీధుల గుండా ర్యాలీ కొనసాగడంతో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు సిబ్బంది చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమం లో మస్జీద్ సదర్ మొహమ్మద్ షకీల్, నాయబ్ సదర్ మొహమ్మద్ రహిమోద్దీన్, కమిటీ సభ్యులు షేక్ గౌస్, మొహమ్మద్ జాలిల్, మొహమ్మద్ అరిఫ్, మస్జీద్ ఇమామ్ అన్వర్ ఉల్ హాక్, అజీమ్, మొజామ్మిల్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులుగా చింతల భూపాల్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఆగస్ట్ 26,: సిద్దిపేట జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులుగా చేగుంట పట్టణ నికి చెందిన చింతల భూపాల్ ని నియమించినట్లు జిల్లా బిజెపి అధ్యక్షులు బైరీ శంకర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు, ఈ సందర్భంగా చింతల భూపాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సిద్దిపేట్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎంపీ మాధవ నేని రఘునందన్ రావు కి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ కి కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ బలోపేతానికి ప్రజా సమస్యల పరిష్కారానికి నా వంతుగా కృషి చేస్తానని అన్నారు.

# నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక మిర్యాలగూడ ఆగస్టు 26: మిర్యాలగూడ మండల పరిధిలోని ఐలాపురం గ్రామానికి చెందిన నూనావత్ విజయ భర్త నూనావత్ నాగ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ పాల్గొని కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు ఈ సందర్భంగా నూతన గృహంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని కుటుంబానికి సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూర్య ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# క్రైమ్ బ్రాంచ్ లో సత్తా చాటుతున్న వెల్దుర్తి బిడ్డ తోట శ్రీకాంత్ ముదిరాజ్



మన ప్రజా ప్రతినిధి నర్సాపూర్ 26: మెదక్ జిల్లా వెల్దుర్తి పట్టణ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి కానిస్టేబుల్ గా ఉద్యోగం సంపాదించి హైదరాబాద్ పట్టణంలో సైబర్ క్రైమ్ స్పెషల్ టీం ఆధ్వర్యంలో పనిచేస్తున్న తోట శ్రీకాంత్ ముదిరాజ్ చదువుకునే రోజుల నుండి క్రీడల్లో చురుకుగా ఉండేవాడు, ఎంతో కష్టపడి పోలీస్ కానిస్టేబుల్ కు ఎంపికైన శ్రీకాంత్ ప్రతిభను చూసి ఉన్నత అధికారులు సైబర్ క్రైమ్ డిపార్ట్మెంట్లో నియమించారు, ఎన్నో డ్రగ్స్ కేసులు, చైన్ స్నాచింగ్, అంతరాష్ట్ర ముఠా దొంగతనాల కేసుల్లో బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర లోని పలు జిల్లాల్లో మొక్కవోని ధైర్యం ప్రదర్శించి కేసులను చేదించాడు ఉన్నతాధికారులు ఏ కేసులు అయినా, పక్క రాష్ట్రం వెళ్లాలంటే తోట శ్రీకాంత్ ముదిరాజ్ కావాల్సిందే సినిమా ఫీల్డ్ లో కూడా పైరసీ చేసిన దొంగలను అంతర్ రాష్ట్రాల నుండి పట్టుకొచ్చిన వార్లో శ్రీకాంత్ కీలక పాత్ర, ఏ డిపార్ట్మెంట్లో అయినా ఉన్నతాధికారులకు సహకరించేది కింది స్థాయి నాయకులే, అలాంటివారిలో నిష్ణాతుడు తోట శ్రీకాంత్ ముదిరాజ్ వెల్దుర్తి ప్రజలకు ఎన్నో సమస్యాత్మక కేసుల్లో అతని సహకారం తల్లిదండ్రులు గుర్తు చేస్తుంటారు.

# జిల్లా పోలీస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏకగ్రీవం



మనప్రజాప్రతినిధి//నారాయణఖేడ్, ఆగస్టు 26: సంగారెడ్డి జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, సిబ్బంది మధ్య సమన్వయంతో అసోసియేషన్ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎ. జనార్ధన్, ఉపాధ్యక్షులుగా బి. రమేష్, బి. నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎం. రాజారామ్, సహాయ కార్యదర్శిగా జి. సంతోష్ కుమార్, కోశాధికారిగా కూన రమేష్, కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ కరీమ్, టి. వెంకటేశం, పి. అరుణ కుమారి, అంగోథ్ రమేష్, మహమ్మద్ ముజామిల్, జి. శ్రీనివాస్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నూతన కార్యవర్గం కృషి చేస్తుందని తెలిపారు. సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ, అందరి సహకారంతో అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



మన ప్రజాప్రతినిధిదినపత్రిక, బచ్చన్నపేట, జనగామ నియోజకవర్గం: జనగామ నియోజకవర్గం బచ్చన్నపేట మండలం, పోచన్నపేట గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన జూల లక్ష్మయ్య కు వేరికోసిల్ సమస్యతో బాధపడుతుండగా, డిసిసి ఉపాధ్యక్షులు నూకల బాల్ రెడ్డి మరియు డిసిసి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు నల్ల మహేందర్, ద్వారా విషయం తెలుసుకున్న నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ వెంటనే బీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, మరియు భువనగిరి ఎంపీ చామల.కిరణ్ కుమార్ రెడ్డి, దృష్టికి తీసుకురాగా, తక్షణం స్పందించి లక్ష రూపాయల ఎల్ వో సి. మంజూరు చేయించడం జరిగింది. ఇట్టి మంజూరు పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్, గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థుల సమక్షంలో బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు నూకల బాల్ రెడ్డి, డిసిసి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు నల్ల మహేందర్, బచ్చన్నపేట మండల ఉపాధ్యక్షులు కొయ్యడి శ్రీనివాస్, టీపీసీసీ ఎస్సీ సెల్ సెక్రటరీ జంగిటి నరేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజేందర్ రెడ్డి, సేవాదళ్ బ్లాక్ కాంగ్రెస్ లింగాల వెంకటరెడ్డి, కొడవటూర్ డైరెక్టర్ శ్రీపతి ప్రభాకర్, చిరంజీవి, ఇమ్మడి నరేష్ రెడ్డి, కొడవటూరు మాజీ డైరెక్టర్ ఈర్ల శివరాములు, పోచన్నపేట మాజీ ఉపసర్పంచ్ జూల కిష్టయ్య, పోచన్నపేట కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగఎల్లేష్, బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేకల ఉపేందర్ రెడ్డి, శ్రీపతి దయాకర్, గౌర్రె దేవదాస్, గట్టు మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాదంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పిస్తాం




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యపేట జిల్లా: బస్సు ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలిసూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట శివారులో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ఫ్రెష్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే. నరసింహ కలిసి ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను స్థానికులను, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కోదాడ ఆసుపత్రికి, తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘటన ప్రాంతంలో స్థానిక పోలీస్ అధికారులు, రెవెన్యూ , వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువకు తాగునీరు విడుదల



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక మిర్యాలగూడ ఆగస్టు 26: తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ఎడమ కాలువ బుధవారం 500 క్యూసెక్కులు నీటిని అధికారులు విడుదల చేశారు. కాలువ పరిధిలో ఉన్న చెరువులు కుంటలు నింపుకొని తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. కొంతకాలంగా కాలువలో నీరు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు నీటి విడుదలతో ఉపశయనం లభించింది దీంతో పరివాహక ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు

# తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి ఎదగాలి..!

-సోషల్ మీడియా రీల్స్‌తో విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దు
-భయం,బిడియం వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి
-చదువుతోనే అవకాశాలు.. పైరవీలకు తావులేదు
-ఇంటర్ రెండేళ్లు జీవితానికి అత్యంత కీలకం
-గ్రామీణ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి పెట్టాలి
-లక్ష్యాన్ని ఎంచుకుని.. కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు
-తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య అందిస్తున్న శ్రీ గాయత్రి కళాశాల అభినందనీయం
-జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం: జనగామ నియోజకవర్గం.జనగామ జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఎన్ గార్డెన్స్‌లో బుధవారం ఏబీవీ ఇన్స్టిట్యూషన్స్ శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ పార్టీ కార్యక్ర మానికి జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి విద్యా ర్థులను ఉద్దేశించి మాట్లాడారు.విద్యార్థుల్లో సబ్జెక్ట్‌పై మంచి పరిజ్ఞానం ఉన్నప్పటికీ,దానిని ఇత రులకు వ్యక్తపరిచే సమయంలో భయం, బిడియం,సిగ్గు వంటి సంకో చాలను వీడాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థు లు సబ్జెక్ట్ నాలెడ్జ్‌లో ముందున్నప్పటికీ కమ్యూనికేషన్ స్కిల్స్ లోపిం చడం వల్ల ఉద్యోగ అవకాశాల్లో వెనుకబడుతున్నారు.విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలు అత్యంత కీలకమైనవి. ఈ సమయాన్ని వృథా చేయకుండా చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని సూచించారు.భయం, బిడియం,సిగ్గు వదిలి ఆత్మవిశ్వాసంతో మాట్లాడటం అల వాటు చేసుకోవాలి. తెలుగులో మాట్లాడేటప్పుడు కూడా భయప డాల్సిన అవసరం లేదన్నారు.ఇంగ్లీష్ మాట్లాడేటప్పుడు తప్పులు దొర్లినా సిగ్గుపడకూడదు. తప్పులు చేస్తూ నేర్చుకోవాలని, ఎవరైనా తప్పును సరిచేస్తే స్వీకరించి మరింత మెరుగుపడాలని సూచించారు.రాబోయే రెండు సంవత్సరాల్లో విద్యార్థులు రెండు అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.ఒకటి సబ్జెక్ట్‌పై పూర్తి పట్టు సాధించడం,రెండోది ఇంగ్లీష్ కమ్యూనికేషన్‌ను మెరుగుపరుచుకోవడం అని తెలిపారు.ఇంగ్లీష్ ప్రపంచాన్ని తెలుసుకునేందుకు ఒక కిటికీ లాంటిది. మన నాలెడ్జ్‌ను ఇతరులకు సమర్థవంతంగా వివరించేందుకు ఇంగ్లీష్ మంచి మాధ్యమంగా ఉపయోగపడుతుంది.ఎంపీసీ విద్యార్థులకు ఇంటర్మీడియట్ తర్వాత ఇంజనీరింగ్‌తో పాటు అనేక ఉన్నత విద్యా అవకాశాలు ఉన్నాయి.బైపీసీ విద్యార్థులు మెడికల్ ఒక్కటే లక్ష్యంగా కాకుండా ఫార్మసీ, ఫార్మా-డి,అగ్రికల్చర్ సైన్సెస్,నర్సింగ్ వంటి డిమాండ్ ఉన్న కోర్సులను కూడా పరిశీలించాలని సూచించారు.ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూప్ చదివినా సబ్జెక్ట్‌ను క్షుణ్ణంగా,స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో అధ్యాపకుల సూచనలు తీసుకోవాలి.ప్రాక్టికల్స్‌తో పాటు థియరీపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.సబ్జెక్ట్ కాన్సెప్ట్స్‌ను అర్థం చేసుకుని చదివితే మం చి ర్యాంకులు సాధించవ చ్చని చెప్పారు.ప్రతిరోజూ క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై ఏకాగ్రతతో చదివినా వేలల్లో మంచి ర్యాంకులు సాధించి ఉన్నత విద్యలో సీట్లు పొందే అవకాశం ఉంటుంది.ఇంజనీరింగ్,ఫార్మసీ,అగ్రికల్చర్, నర్సింగ్ వంటి కోర్సుల్లో సీటు సాధించేందుకు విద్యార్థులు కష్టపడి చదవాలి.అర్హత సాధించిన విద్యార్థులకు అవసరమైన సహకారం అందించేందుకు తాను ముందుం టానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఇతరులపై ఆధారపడకుండా ప్రతి విద్యార్థి తన సొంత ప్రతిభ, ష్టపడి చదివే తత్వంతో సీటు సాధించేందుకు ప్రయత్నించాలి. చదువే జీవితంలో నిజమైన శ్రీరామరక్ష అని అన్నారు.ఉద్యోగం కోసం ప్రైవేట్ రంగంలోకి వెళ్లినప్పుడు మన కులం,ప్రాంతం,కుటుంబ నేపథ్యం కంటే మన నైపుణ్యాలు,కమ్యూనికేషన్ స్కిల్స్,ప్రతిభకే ప్రాధాన్యత ఉంటుంది.సోషల్ మీడియా రీల్స్,అనవసరమైన వీడియోలు చూస్తూ విలువై న సమయాన్ని వృథా చేసుకోవద్దు. అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఫోన్‌ను ఉపయోగించాలని సూచించారు.వాట్సాప్, సోషల్ మీడియాలో ఉపయోగించే 'దీతీశీ', 'హలం' వంటి షార్ట్‌కట్ భాష జీవితంలో ఎలాంటి ఉపయోగం ఇవ్వదు.అది కేవలం ఒక స్టైల్ మాత్రమేనని, భాషా నైపుణ్యాలను పెంచుకునేలా సరైన పదజాలాన్ని నేర్చుకోవాలని సూచించారు.ప్రతిరోజూ ఇంగ్లీష్ పేపర్ చదవడంతో పాటు మంచి ప్రసంగాలు, విజ్ఞానాన్ని పెంచే వీడియోలు చూడాలి. తద్వారా వొకాబ్యులరీ, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు.ఇంజనీరింగ్, మెడిసిన్,ఫార్మసీ, అగ్రికల్చర్.. ఏ రంగాన్ని ఎంచు కున్నా స్పష్టమైన లక్ష్యాన్ని పెట్టుకుని దాని కోసం కష్టపడాలి. లక్ష్యంపై దృష్టి పెడితే మంచి ర్యాంక్‌తో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు.మంచి సీటు కోసం రాజకీయ నాయకుల వద్ద పైరవీలు చేయాల్సిన అవసరం లేకుండా విద్యార్థులు తమ చదువుతోనే అవకాశాలను సాధించుకోవాలి.1982-84 ప్రాంతంలో ప్రైవేట్ కళాశాలలు పెద్దగా లేని సమయంలో తాను చదువుకున్న రోజులను ఎమ్మెల్యే గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ఇంజనీరింగ్ సీటు రాకపోయినా బీఎస్సీ, ఎంఎస్సీ,పీహెచ్‌డీ పూర్తి చేసి,అనంతరం సొంతంగా ప్రైవేట్ కళాశాలను స్థాపించే స్థాయికి ఎదిగిన తన ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకున్నారు.గతంలో హన్మకొండ జూనియర్ కళాశాలలో చదువుకున్న రోజుల్లో ఫిజిక్స్,కెమిస్ట్రీ,మ్యాథ్స్,తెలుగు,హిందీ వంటి ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయులను పేరుపేరునా గుర్తు చేసుకునే పరిస్థితి ఉండేది.కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఒకే సబ్జెక్టును వివిధ భాగాలుగా విభజించి బోధించే విధానం ఉందని, అయితే విద్యార్థులకు సబ్జెక్ట్‌పై సమగ్ర అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని అన్నారు.ఏబీవీ ఇన్స్టిట్యూషన్స్ ముప్పైమూడు సంవత్సరాలుగా విద్యార్థులు,తల్లిదండ్రుల నమ్మకాన్ని సంపాదించుకుని ముందుకు సాగడం అభినందనీయమన్నారు.కార్పొరేట్ విద్యాసంస్థల్లో లక్షల్లో ఫీజులు చెల్లించి లక్షల్లో ర్యాంకులు సాధిస్తుంటే,తక్కువ ఫీజులతోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ వేలల్లో మంచి ర్యాంకులు సాధించేలా శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల చేస్తున్న కృషి అభినందనీయం.విద్యార్థులు అందుబాటులో ఉన్న సమయాన్ని,మంచి అధ్యాపకుల మార్గదర్శకత్వాన్ని, కళాశాలలోని అనుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలి.భవిష్యత్తులో తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి ఎదిగి,సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా నిలవాలని ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





మన ప్రజా ప్రతినిధి దినపత్రిక మిర్యాలగూడ ఆగస్టు 26: నియోజకవర్గంలో అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందనిమిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పేర్కొన్నారుఈరోజు మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామంలో అలాగే దామరచర్ల మండలం రాళ్లవాగు తండా గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లనుఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారుఈ సందర్భంగా నూతన గృహాలను పరిశీలించి లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి వారికి నూతన గృహప్రవేశ శుభాకాంక్షలుతెలియజేశారుసొంతింటి కల నెరవేరిన లబ్ధిదారుల ఆనందాన్ని పంచుకున్నారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని అన్నారుప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మిర్యాలగూడ నియోజకవర్గంలో కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరిగేలా అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు కార్యకర్తలు గ్రామస్థులు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# నిరు పేద విద్యార్థులకు 10 శాతం ఉచిత సీట్లు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:అంతర్జాతీయ ప్రమాణాలతో స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల... రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావురఘునాథపాలెం మండలం జింకలతాండలో 13 ఎకరాల్లో గురుకుల పాఠశాలస్వామి నారాయణ్ గురుకుల పాఠశాల నిర్మాణ పనులకు భూమిపూజ, శంకుస్థాపన చేసిన మంత్రి ఖమ్మంగిరిజన ప్రాంతంలో విద్యా ప్రమాణాలను మరింత పెంచడంతో పాటు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలతో పాటు చుట్టుపక్కల జిల్లాల విద్యార్థులకు సైతం నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించే దిశగా రఘునాథపాలెం మండలం జింకలతండాలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్వామినారాయణ గురుకుల పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి బుధవారం భూమిపూజ, శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 13.10 ఎకరాల్లో స్వామి నారాయణ గురుకుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాబోధన అందించనున్నారన్నారు. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో పాఠశాల భవనాలు, విద్యార్థులకు అవసరమైన ఆధునిక సౌకర్యాలతో క్యాంపస్ రూపుదిద్దుకోనుందని తెలిపారు.విద్యతో పాటు మానవతా విలువలు, సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ వ్యవస్థ, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా విద్యాబోధన సాగనుందని మంత్రి తెలిపారు. ఆధునిక విద్యతో పాటు భారతీయ విలువలను విద్యార్థుల్లో పెంపొందించేలా గురుకుల్ విద్యా విధానం ఉండనుందన్నారు.తెలంగాణలో స్వామినారాయణ గురుకుల్‌కు ఇది 5వ విద్యాసంస్థ అని మంత్రి అన్నారు. పాఠశాలలో అందుబాటులో ఉండే సీట్లలో 10 శాతం సీట్లను ఎలాంటి ఫీజు లేకుండా నిరుపేద విద్యార్థులకు కేటాయించే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు అప్పగించారన్నారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందే అవకాశం లభించనుందని తెలిపారు. గిరిజన ప్రాంతాలతో పాటు ఖమ్మం జిల్లా, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు నాణ్యమైన విద్యను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఈ విద్యాసంస్థ ఏర్పాటు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఆధునిక విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మానవతా విలువలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందని, స్వామినారాయణ గురుకుల్ విద్యా విధానం ఈ లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, స్వామీ నారాయణ్ గురుకుల్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి...
## జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:గణేష్ నిమజ్జనం సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి నిమజ్జనం పాయింట్ల వద్ద గజ ఈతగాళ్లు, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచాలి కాల్వొడ్డు మున్నేరు, ప్రకాష్‌నగర్, తీర్థాల వద్ద గణేష్ నిమజ్జనం ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు.ఖమ్మం రూరల్ మండలం తీర్థాల వద్ద ఆకేరు నది పరిసరాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన ప్రదేశం, నీటి మట్టం, రహదారి మార్గాలు, వాహనాల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు అధికారులు, స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు మున్నేరు, ప్రకాష్‌నగర్ వద్ద నీటి మట్టాన్ని, గణేష్ నిమజ్జనానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నిమజ్జనం ప్రదేశాలను సమగ్రంగా పర్యవేక్షించి ప్రజలకు అనువుగా తుది నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. నిమజ్జనం పాయింట్ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలిగణేష్ నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, తగినంత లైటింగ్, బ్యారికేడ్లు, తాగునీటి సరఫరా, మొబైల్ టాయిలెట్లు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని అన్నారు.నిమజ్జనం పాయింట్ల వద్ద గజ ఈతగాళ్లను, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన రక్షణ పరికరాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో నీటి లోతు, ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని, ప్రధాన మార్గాల్లో పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అన్నారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ప్రజలు, ఉత్సవ కమిటీలు సహకరించి, ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ, సంయమనం పాటించాలని కలెక్టర్ కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో పూర్తి స్థాయిలో సమన్వయంతో సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ రామాంజనేయులు, ఇరిగేషన్ సీఈ వసంతి,

# తన తుది శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్ముకున్న వ్యక్తి...
## సురవరం సుధాకర్ రెడ్డి




నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ) ఉద్యమాలే ఊపిరిగా.... పోరాటమే ప్రాణంగా చివరి శ్వాస వరకు ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కొరకు మడమ తిప్పని పోరాటం చేసిన నల్లగొండ మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి గారి జీవితం ఆదర్శ నీయమని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు బుధవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సిపిఐ అగ్ర నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ..... విద్యార్థి దశ నుంచే అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారని డిండి ప్రాజెక్టు సాధన కోసం డిండి నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించారని అలాగే ప్రపంచ యువజన సమాఖ్య నిర్మించి నాయకత్వం వహించారని ఆయన గుర్తు చేశారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఐక్యరాజ్యసమితిలో భారతదేశం తరపున ప్రతినిధిగా పాల్గొని ప్రసంగించి, ప్రపంచ నాయకుల దృష్టిని ఆకర్షించారని, ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ ప్రజల్లోకి వెళ్లడానికి ప్రజా సంఘాలు అత్యంత మూలాధారమని వివిధ రంగాల్లోని సమస్యలను ప్రజాసంఘాల ద్వారా తెలుసుకొని వాటి పరిష్కారం కొరకు ప్రజా ఉద్యమాలు నిర్వహించడం ద్వారా విస్తృతంగా కమ్యూనిస్టు పార్టీ ని ప్రజా బాహుళ్యం లోకి తీసుకెళ్ల వచ్చనే విశ్వాసంతో పని చేశారని, విద్యార్థి యువజన మహిళ రైతు వ్యవసాయ కార్మిక సంఘాలతో పాటు పారిశ్రామిక కార్మిక సంఘాల నిర్వాణం జరిపించడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం దొడ్డ వెంకటయ్య పాలకూరి బాబు రెమిడాల రాజు అమరారపు పున్నయ్య బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, ముత్యాల భాస్కర్ బిఆర్ఎస్ నాయకుడు రాపోలు నవీన్ సిఐటియు మండల కార్యదర్శి నీలా రామ్మూర్తి ఎస్కే పాషా ధూళిపాళ నిఖిల్ చక్రవర్తి దోమకొండ మనోజ్, రమేష్ రామ్ సైదులు పల్లె పంగ నాగరాజు బత్తిని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# సూరారం గ్రామంలో ఘనంగా వనమహోత్సవం
# గ్రామంలో వెయ్యి మొక్కలు నాటిన గ్రామస్తులు



సదాశివపేట మండల్ రిపోర్టర్ ఆగష్టు 26//(మన ప్రజా ప్రతినిధి దినపత్రిక):సూరారం ప్రకృతి గ్రామంగా తీర్చిదిద్దాలని,అందుకోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూరారం గ్రామ సర్పంచ్ మొగ్ధం పటేల్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం రోజు సూరారం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శిరీష. ఏపీఓ గీతా. టీఎ. స్వప్న. మాట్లాడుతూ. సూరారం గ్రామంలో 1000 మొక్కల ప్లాంటేషన్ తోని మొక్కలు నాటేందుకు మరియు . గ్రామస్తులు ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి పచ్చదనం గ్రామంగా తీర్చిదిద్ది పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.చెట్ల పెంపకాన్ని..బాధ్యతగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో.ఫీల్డ్ అసిస్టెంట్ రాజు.గ్రామస్తులు పెద్దలు చిన్నలు అందరు కలిసి ఈ ప్రోగ్రాం విజయవంతం చేయడం జరిగింది.

# సొంత పనులకు గ్రామపంచాయతీ ట్రాక్టర్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక అల్లాదుర్గం:అల్లాదుర్గం.. గ్రామీణ పల్లెలు పరిశు భ్రంగా ఉంచుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ మంజూరు చేస్తే గొల్ల కుంట గ్రామపంచాయతీ సర్పంచ్ మాన్య నాయక్ తన సొంత పనులకువినియోగిస్తున్నారని తండావాసులు ఆరోపిస్తున్నారు. పంచాయతీలో చెత్త ను డంపింగ్ యార్డ్ లకు తరలించడంతోపాటు హరితహారం, ప్రకృతి వనం లాంటి మొక్కలను ట్రాక్టర్ ద్వారా నీటి సరఫరా చేయాలని సదుద్దేశంతో ప్రభుత్వం ట్రాక్టర్లను మంజూరు చేస్తే దానికి భిన్నంగా సర్పంచ్ తన సొంత అవసరాలకు వాడుకుంటూ ప్రభుత్వ నిధులును దుర్వినియోగం చేస్తున్నారని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనాఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# కంటైనర్‌ను ఢీకొన్న బస్సు...ఆరుగురు మృతి

**- సూర్యాపేట జిల్లాలో తెల్లవారుజామున ఘోర ప్రమాదం**
**- మృతుల సంఖ్య పెరిగే అవకాశం**
**- ఇరవై మందికి తీవ్ర గాయాలు**
**- హైదరాబాద్ఏలూరు బస్సుకు విషాదం**



సూర్యాపేట, ఆగస్టు 26 (మనప్రజాప్రతినిధి): సూర్యాపేట జిల్లాలో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు మృతి చెందగా, మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కోదాడ మండలం దొరకుంట శివారులో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన కంటైనర్ లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ఏలూరుకు 42 మంది ప్రయాణికులతో బయలుదేరిన ప్రైవేటు బస్సు దొరకుంట సమీపానికి చేరుకున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రహదారిపై ఆగి ఉన్న కంటైనర్ లారీని డ్రైవర్ గమనించకపోవడంతో వేగంగా వెళ్లి ఢీకొట్టినట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాదం తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది.ప్రమాద సమయంలో ఎక్కువ మంది ప్రయాణికులు నిద్రలో ఉండటంతో ఒక్కసారిగా తీవ్ర విషాదం నెలకొంది. మృతుల్లో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్లు అధికారులు గుర్తించగా, మరో వ్యక్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతుల గుర్తింపునకు పోలీసులు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లలో కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని వైద్య వర్గాలు తెలిపాయి.ప్రమాదంలో బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు సహాయక బృందాలు తీవ్రంగా శ్రమించాయి. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యమా, కంటైనర్ నిలిపివేతలో నిబంధనల ఉల్లంఘన జరిగిందా అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

# అభివృద్ధి అంశాలపైనే భట్టితో భేటీ

**- కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నానన్న ఎమ్మెల్యే**
**- పార్టీ బలోపేతమే తన లక్ష్యమని స్పష్టం**
**- రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే ధ్యేయమన్న వ్యాఖ్య**



హైదరాబాద్, ఆగస్టు 26 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో జరిగిన భేటీపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రిని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కేటాయింపులు, ప్రజా సమస్యల పరిష్కారంపైనే చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ భేటీకి రాజకీయ ప్రాధాన్యత లేదని, అభివృద్ధి కార్యక్రమాల కోసమే సమావేశమైనట్లు పేర్కొన్నారు. తాను కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న సీనియర్ నాయకుడినని రాజగోపాల్ రెడ్డి అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. 2018 ఎన్నికల్లో అనేక మంది సీనియర్ నాయకులు ఓటమి పాలైనప్పటికీ మునుగోడు ప్రజలు తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు.పార్టీ బలోపేతం, కార్యకర్తల ప్రయోజనాల కోసమే తన వ్యాఖ్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. వ్యక్తిగత విమర్శలు చేయడం తన ఉద్దేశం కాదన్నారు. ఎన్నికల సమయంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి అవకాశాలు కల్పించినప్పటికీ, పార్టీని నమ్ముకుని పనిచేసిన కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని అభిప్రాయపడ్డారు. మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదంపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి, ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే అంతిమమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పందించారని, క్రమశిక్షణ సంఘం కూడా సంబంధిత అంశాలపై నివేదిక సమర్పించినట్లు తెలిపారు. పార్టీ నిర్ణయాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు.తనపై విమర్శలు చేస్తున్న వారు ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని రాజగోపాల్ రెడ్డి సూచించారు. తాను ఎప్పటికీ పార్టీ క్రమశిక్షణను పాటిస్తానని, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తానని చెప్పారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని రాజగోపాల్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చూడాలన్నదే తమ ఆశయమని, ఆ దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వమే అండ

**- కేంద్రం నుంచి నిధులు రాలేదని మంత్రి ఆవేదన**
**- పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం**
**- చివరి బిల్లుల చెల్లింపులకు చర్యలు**
**- ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం**




హైదరాబాద్, ఆగస్టు 26 (మనప్రజాప్రతినిధి): పేదల సొంతింటి కలను సాకారం చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందకపోయినా తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలును ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం ఏడాదికిపైగా ఎదురుచూశామని మంత్రి తెలిపారు. పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటివరకు కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ఇళ్లను మంజూరు చేయాలని అనేక సందర్భాల్లో కోరినట్లు చెప్పారు.2014 నుంచి 2023 వరకు గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదని మంత్రి పేర్కొన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణంపై భారీ డిమాండ్ ఏర్పడిందని తెలిపారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయన్న ఆశతో ఇప్పటికే పూర్తయిన ఇళ్లకు సంబంధించిన చివరి బిల్లుల చెల్లింపును తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పలుమార్లు కలిసి తెలంగాణకు ఇళ్ల మంజూరు చేయాలని కోరినట్లు వెల్లడించారు. ఇటీవల పార్లమెంట్ సభ్యులతో కలిసి తాము కూడా కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ సానుకూల స్పందన రాలేదని పేర్కొన్నారు.ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు చివరి బిల్లుల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయదని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రం తన బాధ్యత నిర్వర్తించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల తన బాధ్యతను నెరవేరుస్తుందని చెప్పారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా పేదల సంక్షేమం విషయంలో వెనక్కి తగ్గబోమన్నారు. పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు

# మోహన్ భగవత్ అమెరికా పర్యటన చర్చనీయాంశం

**- వీసా అంశంపై కేఏ పాల్ వ్యాఖ్యలు**
**- అంతర్జాతీయ వేదికపై పెరిగిన ఆసక్తి**
**- మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో సభ**
**- మద్దతునిరసనల మధ్య పర్యటన**



హైదరాబాద్, ఆగస్టు 26 (మనప్రజాప్రతినిధి): ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ అమెరికా పర్యటన అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాల్లో 17 రోజులపాటు నిర్వహించనున్న గ్లోబల్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా ఆయన అమెరికా చేరుకున్నారు. ఈ పర్యటనపై రాజకీయ, దౌత్య, సామాజిక వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ముఖ్యంగా భారతీయ ప్రవాసులు అధిక సంఖ్యలో నివసించే ప్రాంతాల్లో ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోంది. మోహన్ భగవత్ అమెరికా పర్యటనపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ స్పందిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. భగవత్ అమెరికా రాకముందే కొందరు క్రైస్తవ, ముస్లిం, సిక్కు సంస్థలు ఆయన వీసాను రద్దు చేయాలని అమెరికా ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినట్లు తనకు సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై అమెరికా ప్రతినిధుల్లో ఒకరు తన అభిప్రాయం కూడా కోరినట్లు ఆయన వెల్లడించారు. అయితే ప్రజాస్వామ్య దేశంలో ఎవరి పర్యటననైనా అడ్డుకోవడం సరైన విధానం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. భావప్రకటనా స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ సమానంగా ఉండాలని తాను అమెరికా నాయకత్వానికి స్పష్టం చేసినట్లు కేఏ పాల్ తెలిపారు.



వ్యక్తిగతంగా ఎవరి సిద్ధాంతాలతో విభేదాలు ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్య విలువలను కాపాడడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఒక వ్యక్తి లేదా సంస్థకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించడం కంటే ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ పర్యటనలో భాగంగా ఆగస్టు 29న న్యూయార్క్ నగరంలోని ప్రముఖ మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో 'యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్స్' పేరిట భారీ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు, వివిధ సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొనే అవకాశముందని నిర్వాహకులు చెబుతున్నారు. సభలో మోహన్ భగవత్ ముఖ్య ప్రసంగం చేయనున్నట్లు సమాచారం.అమెరికాలోని కొన్ని హక్కుల సంఘాలు, సామాజిక సంస్థలు ఈ పర్యటనపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, మరోవైపు భగవత్ పర్యటనకు మద్దతు తెలిపే వర్గాలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. దీంతో ఈ పర్యటన రాజకీయ, సామాజిక, దౌత్య పరంగా మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. అమెరికా మీడియా కూడా ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తోంది. ఈ నేపథ్యంలో మాడిసన్ స్క్వేర్ గార్డెన్ సభలో మోహన్ భగవత్ ఇచ్చే సందేశంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ప్రజాస్వామ్యం, సోదరభావం, సామాజిక సామరస్యం వంటి అంశాలపై స్పష్టమైన సందేశం ఇవ్వాలని కేఏ పాల్ ఆకాంక్షించారు. అమెరికా పర్యటన ముగిసే వరకు దీనికి సంబంధించిన పరిణామాలు దేశ, విదేశ రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.